

## నీటి సరఫరాకు అంతరాయం

సిటీబ్యూరో: జలమండలి పరిధిలోని హిమాయత్ సాగర్ రిజర్వాయర్ ఫోర్ బే, మిరాలం ఫిల్టర్ బెడ్స్ సెట్టింగ్ ట్యాంకులు, ఇన్‌లెట్ చానళ్లను శుభ్రం చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనున్నది. ఈ నెల 11 (శనివారం)న ఉదయం ఆరు గంటల నుంచి మరుసటి రోజు ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు ఈ క్లీనింగ్ పనులు నిర్వహించనున్నారు. 24 గంటల పాటు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా అంతరాయం ఏర్పడనుందని అధికారులు పేర్కొన్నారు. హసన్‌నగర్, కిషన్‌బాగ్, దూద్‌బౌలి, మిస్రిగంజ్, పత్తర్ గట్టి, దారుల్ షిఫా, మొఘల్‌పురా, జహనుమా, చందులాల్ బరాదరి, ఫలక్‌నుమా, జంగంమెట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరారు.


# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 9 జనవరి 2025 | HYDERABAD




మెట్రో ప్రయాణికులకు సంక్రాంతి అనుభూతులను అందించడమే లక్ష్యంగా.. సంక్రాంతి మెట్రో ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. మరో రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మెట్రో సేవలను మరింత మందికి చేరువ చేయడంలో, కమ్యూనిటీలో ప్రయాణికులను కూడా భాగస్వామ్యం చేసే ఉద్దేశంతోనే సంక్రాంతి మెట్రో ఫెస్ట్ చేపట్టినట్లు ఎల్ అండ్ టీ ఎండీ సీఈవో కేవీబీ రెడ్డి తెలిపారు.

-సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ)

# పేదల గుండెల్లో వక్ఫ్ గుబులు

### అయినా పట్టించుకోని ప్రభుత్వం
### వక్ఫ్ భూముల పేరిట నిషేధాజ్ఞలతో అవస్థలు
### ఉన్న భూములను అమ్ముకోలేక ఒత్తిడికి గురవుతున్న ప్రజలు



మౌలాలి కమాన్

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : వక్ఫ్ భూముల పేరిట రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గడిచిన నాలుగు నెలలుగా నగరంలో ప్రధానంగా మేడ్చల్ జిల్లా పరిధిలో పలు సర్వే నంబర్లను సర్కారు నిషేధించింది. దీంతో అవసరానికి ఇండ్లు, భూములను అమ్ముకోలేక జనాలు తిప్పలు పడుతున్నారు. రెండు దశాబ్దాల కిందట ఇచ్చిన గెజిట్‌ను ప్రామాణికంగా తీసుకొని, ఇప్పుడు వక్ఫ్ భూములని తేల్చి చెప్పడంతో నెత్తినోరు బాదుకుంటున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అక్కరకు వస్తుందని భావించిన స్థిరాస్తులను ప్రభుత్వం 'వక్ఫ్ పాతర' వేసిందని ఆందోళన చెందుతున్నారు. అయితే ఎందుకు ఉన్న పళంగా వక్ఫ్ భూముల పేరిట సర్కారు రిజిస్ట్రేషన్లు నిలిపివేసిందనేది ఇప్పుడు అంతు చిక్కని సమస్యగా మారుతుండగా, ముఖ్యంగా ప్రభుత్వం కూడా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఈ నిబంధన ఎందుకు అమలు చేస్తుందనేది తెలియడం లేదు. దీని వెనుక రియల్ ఎస్టేట్ కుట్ర దాగిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుండగా, స్థానికంగా తమ భూములను గిరాకీ లేకుండా పోయే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### ఈస్ట్ సిటీలో సుమారు 100కుపైగా..

ఈస్ట్ సిటీలోని దాదాపు 100కు పైగా కాలనీలను వక్ఫ్ భూముల జాబితాలో చేర్చిన ప్రభుత్వం... స్థిరాస్తి వ్యవహారాలను ప్రశ్నార్థకం చేస్తున్నది. దిక్కుతోచని పరిస్థితుల్లో నగర వాసులు తమ భూముల కోసం ఆరా తీస్తున్నారు. ఇన్నాళ్లు తమవేనని ధీమాగా ఉన్న ఆ గుండెల్లో వక్ఫ్ గుబులు పుట్టుకున్నది. ఎప్పుడో రెండు దశాబ్దాల కిందట కొనుగోలు చేసిన భూములను ఇప్పుడు వక్ఫ్ భూములుగా నిర్ధారించడం తమపై ప్రభుత్వం వేసిన పిడుగేనని అభిప్రాయపడుతున్నారు. అక్కడితో ఆగిపోకుండా ఈస్ట్ సిటీలోని ప్రధానమైన మల్కాజిగిరి, ఉప్పల్, ఘట్‌కేసర్ వంటి ప్రాంతాల్లోనూ పలు కాలనీల్లో ఉండే వందల సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చడం ఇప్పుడు ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో దశాబ్దాల కాలంగా నివాసం ఉంటున్న ఇండ్లు, జాగాలన్నీ కూడా వక్ఫ్ బోర్డు వశం చేసేలా ప్రభుత్వ వ్యవహారం ఉంది. దశాబ్దాల కిందటే రిజిస్ట్రేషన్లు, చార్జీలు కట్టి, మ్యూటేషన్ చేసుకుని, బల్దియా అనుమతులతో కట్టిన ఇండ్లకు నల్లా, కరెంట్, ఘరీపట్టి కడుతున్న ఇండ్లు, ఖాళీ జాగాల జీవం తీసేలా చేసింది.

### పేదల బతుకులతో చెలగాటం..

రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూములన్నీ నిర్ధారించిన సర్వే నంబర్లను కూడా ఎలాంటి ప్రామాణికత లేకుండా వక్ఫ్ భూములుగా నిర్ధారిస్తూ సర్కారు నిషేధించింది. ఆయా సర్వే నంబర్లలో ఉండే అన్ని భూములకు వక్ఫ్ నిబంధనలు వర్తిస్తూ తీసుకువచ్చిన సర్క్యులర్ ఇప్పుడు పేదోడి గుండెను నలిపేస్తున్నది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని పలు కాలనీలను వక్ఫ్ జాబితాలో చేర్చి... వారితో బతుకులతో సర్కారు చెలగాటమాడుతున్నది. ఒక్క మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని మౌలాలీలోని వందకు పైగా సర్వే నంబర్లను వక్ఫ్ జాబితాలో చేర్చింది. రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో మూడు నెలలుగా అక్కరకు వస్తుందనుకునే స్థిరాస్తి కాస్తా చిక్కుల్లో పడిందని ప్రజలు మదన పడుతున్నారు. అవసరానికి సొమ్ము చేసుకోలేక, అప్పులు తీసుకోలేక, తమవే అనుకున్న భూములు తమకు కాకుండా పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అయితే వక్ఫ్ భూములుగా నిర్ధారిస్తూ పేదల బతుకులతో చెలగాటం ఆడుతున్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడుతున్నారు.

### 20వేలకు పైగా కుటుంబాలు..

1989లో జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఒక్క మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోనే 20వేలకు పైగా కుటుంబాలను రోడ్డునపడేసింది. ఇలా ఒక్క మేడ్చల్ జిల్లాలోనే ఉందనుకుంటే పొరపాటే. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోనూ అంతర్గతంగా వక్ఫ్ భూముల సర్క్యులర్స్ విడుదల అయినట్లుగా తెలిసింది. ఇదే గనుక జరిగితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వక్ఫ్ భూముల పేరిట బాధితులుగా మారే వారి సంఖ్య మరింత పెరుగుతుంది. అయితే దశాబ్దాల కిందటే ఆ భూములను వక్ఫ్ భూములుగా పేర్కొంటే... ఆ సర్వే నంబర్లలో ఇన్నాళ్లు ఎందుకు లావాదేవీలను నిలిపివేయలేదని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ వచ్చిన పదేండ్ల తర్వాత వక్ఫ్ గుబులు పెట్టించడం వెనుక ఏదో పెద్ద కుట్రనే దాగుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

### నిషేధిత కాలనీలివే..

ఒక్క మల్కాజిగిరి నియోజకవర్గంలోనే కాలనీ నిషేధించిన సర్వే నంబర్లు వందకు పైగా ఉన్నాయి. వీటితోపాటు బోడుప్పల్ సమీపంలోని మేడిపల్లి, అన్నోజిగూడ, ఈసీఐఎల్ సమీపంలోని రాంపెల్లి, ఘట్‌కేసర్‌లోని పలు ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఇక మౌలాలి గుట్టకు సమీపంలో ఉన్న.. సఫిల్ నగర్, హరిజన్ బస్తీ, సాదుల్లా నగర్, ద్వారకమాయి కాలనీ, సుధా నగర్, భజన మందిర్, న్యూ వెంకటేశ్వర్ నగర్, భరత్ నగర్, విఘ్నేశ్వర్ నగర్, గణేశ్ నగర్, మహాత్మ గాంధీ నగర్, నెహ్రూ నగర్, శ్రామిక నగర్, ఈస్ట్ ప్రగతి నగర్, ఎస్పీ నగర్, ఆండాల్ నగర్, చందా బాగ్, వడ్డెర బస్తీ, ఓల్డ్ మౌలాలీ, బాగ్ ఏ హైదరీ, హనుమాన్ నగర్, ఆర్టీసీ కాలనీ, కృష్ణానగర్, పీఎస్ఆర్ కాలనీ, కేసీఆర్ బస్తీ, ఓల్డ్ సఫిల్ గూడ, రాక్ హిల్ కాలనీ, శంకరయ్య కాలనీ, పీబీ కాలనీ, జేకే కాలనీ, సమతా నగర్, ఈస్ట్ కాకతీయనగర్ ఇలా వందలాది కాలనీలు కూడా నివాసాలుగా దశాబ్దాల కిందటే మారిపోయాయి. కానీ ప్రభుత్వం తీసుకున్న వచ్చిన సర్క్యులర్ ఇప్పుడు ఆ కాలనీల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారిని భయాందోళనలకు గురి చేస్తున్నది.

### రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం సరికాదు..



పేదలు, మధ్యతరగతి వర్గాలకు చెందిన ఎంతో మంది ఎన్నో ఏళ్ల కిందట కట్టుకున్న ఇండ్లను ఇప్పుడు వక్ఫ్ భూములుగా నిర్ధారించడం వెనుక పెద్ద కుట్ర జరుగుతున్నది. నిజానికి ఒక భూమిని వక్ఫ్ ఆస్తులుగా నిర్ధారించాలంటే ఎలాంటి నిబంధనలు ఉన్నాయి. నిజంగా వక్ఫ్ భూములని 1989లోనే తేల్చితే, ఇప్పుడు ఎందుకు అమలు చేస్తున్నారు. మరీ ఇన్నాళ్లు కట్టిన పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలు, కొనుగోలు చేసేందుకు అయిన డబ్బుల సంగతేంటీ? వక్ఫ్ భూములకు ప్రత్యేక చట్టాలు ఉండొచ్చు. కానీ నివాసం ఉంటున్న ఇండ్లను ఈ జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం సరికాదు. ప్రభుత్వానికి పేదలను అభివృద్ధి చేయాలనే తపన ఉంటే... ఇలాంటి సమస్యాత్మక భూముల వివాదాలకు తెర దించేలా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే వక్ఫ్ భూముల జాబితా నుంచి వీటిని తొలగించాలి. అంతే గానీ రిజిస్ట్రేషన్లు ఆపితే, అవసరానికి అమ్ముకోవాలని అనుకునేవారి పరిస్థితి ఏం కావాలి.

**-నారగోని ప్రవీణ్, తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్**

### వక్ఫ్ భూముల ఉత్తర్వులను రద్దు చేయాలి



ప్రభుత్వం వక్ఫ్ బోర్డు రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలి. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఉన్న పదుల కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం ఇంటి పన్ను, ఎలక్ట్రిసిటీ, వాటర్ బిల్లులు చెల్లిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో ఇంటిపైన లోన్ తీసుకోవడానికి బ్యాంకులు ఇవ్వడం లేదు. అదేమంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని అంటున్నారు. దీంతో ఇన్నాళ్లు మా ఆధీనంలో ఉన్న భూముల భవిత ఏమవుతుందనే అనుమానంతో ఆందోళన కలిగిస్తున్నది. ప్రభుత్వం లాగేసుకుంటే మా కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుంది.

**- రఫీక్, జీకే కాలనీ**

### ఇబ్బందులు వస్తున్నాయి..



మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వక్ఫ్ బోర్డు స్థలాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని మాకు పైసాపైస కూడబెట్టి ఏండ్ల కిందటే భూములు కొని, ఇండ్లు కట్టుకున్నాం. ప్రభుత్వం ఇటీవల రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ, పలు సర్వే నంబర్లను నిషేధించడం వల్ల నష్టం వాటిల్లుతుంది. బ్యాంక్ నుంచి లోన్లు రావని తెలిసి ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వక్ఫ్ బోర్డు పేరిట జారీ చేసిన నిషేధిత ఉత్తర్వులను ఎత్తివేయాలి.

**- జీ రాము, జీకే కాలనీ**

### డ్రైవరన్నలు పిట్టల్లా రాలుతున్నా..
# పట్టించుకోరా?

### కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు
### ఆదుకోని సర్కారు.. వాహన సంఘాల నేతల ఆగ్రహం

సిటీబ్యూరో: ఆటో డ్రైవర్లు పిట్టల్లా రాలుతుంటే కాంగ్రెస్ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం విచారకరమని వాహన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గద్దెనెక్కినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 80 మందికి పైగా రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్నారని.. ఒక్క ఆటో డ్రైవర్ చావుపై కూడా సర్కారు మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారని.. అధికారంలోకి వచ్చాక డ్రైవర్లను పట్టించుకున్న పాపాన పోలేదని బీఆర్‌టీయూ, తెలంగాణ క్యాబ్ అసోసియేషన్, టీపీడీయూ సంఘాల నాయకులు మారయ్య, షేక్ సలావుద్దీన్, సత్తిరెడ్డిలు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తాజాగా ఏటూరు నాగారంలో గిరాకీ లేక ఆటో డ్రైవర్ నాగరాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై వాహన సంఘాల నాయకులు స్పందించారు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని సర్కారు మాటిచ్చిందని..కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని విమర్శించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కూడా తొలుత చర్చల పేరిట హడావిడీ చేసినా.. ఇప్పుడు చర్చల ఊసెత్తడం లేదన్నారు. ఇటీవల చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం కూడా మంత్రి పొన్నం హామీతో నిలుపుదల చేసినప్పటికీ మంత్రి మాత్రం సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదని వాపోయారు.

'అతడి పేరు పరశురామ్ గౌడ్. నాచారం ఆటో డ్రైవర్. ఆటోను నమ్ముకుని జీవన సాగించాడు. కుటుంబాన్ని పోషించాడు. కాంగ్రెస్ తీసుకొచ్చిన ఉచిత బస్సు స్కీంతో ఆటో గిరాకీ లేక పోవడంతో పరశురామ్‌కు కష్టాలు మొదలయ్యాయి. ఓ వైపు ఫైనాన్స్ ఆటో, మరోవైపు ఇల్లు కిరాయి.. అప్పులు.. ఇవన్నీ అతడిని చుట్టు ముట్టాయి. అనారోగ్యానికి సైతం గురయ్యాడు. కొన్ని రోజులు ఆసుపత్రుల్లో సైతం చికిత్స పొందాడు. ఇక ఆటోను నమ్ముకుంటే బతికే పరిస్థితి కనిపించకపోవడంతో ఏం చెయ్యాలో తెలియక అక్టోబర్ 7న ఉదయం 8:30 గంటలకు ఉరేసుకుని చనిపోయాడు. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇప్పటికీ ఆ కుటుంబానికి రేవంత్ సర్కారు ఎలాంటి సాయం అందించలేదు.'

### రవాణా శాఖ మంత్రి స్పందించాలి



మహాలక్ష్మి పథకం అమలులో నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చి.. ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందించలేదు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ సర్కారే బాధ్యత వహించాలి. డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ సర్కారు విఫలమైంది. ఓ వైపు గిరాకీ లేక.. మరోవైపు ఆన్‌లైన్ ఆధారిత వాహన సేవలతో డ్రైవర్లు పూర్తిగా నష్టపోతున్నారు. ప్రభుత్వం యాప్ తీసుకొస్తానని మాటిచ్చి.. ఇప్పుడు చోద్యం చూస్తున్నది. ప్రైవేట్ ఫైనాన్షియర్లు డ్రైవర్లను జలగల్లా పీడిస్తున్నారు. గిరాకీ లేకపోతే వాళ్ల డబ్బులు ఎలా చెల్లిస్తారు? కుటుంబాన్ని ఎలా పోషిస్తారు? రవాణా శాఖ మంత్రి దీనిపై స్పందించాలి.

**-షేక్ సలావుద్దీన్, తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు**

### పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం..



రాష్ట్రంలో మహాలక్ష్మి ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారు. కండ్ల ముందు డ్రైవర్ల దీనస్థితి కనిపిస్తున్నా.. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదేం పద్ధతి? కనీసం ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని కూడా ఓదార్చిన పాపానపోలేదు. ఆత్మహత్య చేసుకున్న ప్రతీ డ్రైవర్ కుటుంబంలో ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్రూం అందించాలి. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. అది కూడా నెరవేర్చలేదు. దీనిపై రవాణా శాఖ మంత్రి పొన్నం ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం విడ్డూరం. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

**-వేముల మారయ్య, బీఆర్‌టీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు**

### రూ. 12వేలు కూడా ఇవ్వలేదు..



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని మాటిచ్చి ఇప్పటికీ చేయలేదు. ఏడాదికి రూ.12వేలు కూడా ఇవ్వలేదు. పార్కింగ్ సమస్య, ఇష్టానుసారంగా చలాన్లు విధించడం తదితర కార్యకలాపాలతో మేమంతా విసిగిపోతున్నాం. గత ప్రభుత్వ హయాంలో డ్రైవర్లు తమ సమస్యలను చెప్పుకుంటే సత్వరమే పరిష్కారమయ్యేవి. గతంలో రెండు త్రైమాసిక వాహన పన్నును కేసీఆర్ సర్కారు రద్దు చేసింది. డ్రైవర్ల కోసం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా తీసుకొచ్చారు. కానీ కాంగ్రెస్ సర్కారు మాత్రం డ్రైవర్ల ఆత్మహత్యలే లక్ష్యంగా కక్ష సాధిస్తున్నది.

**-సత్తిరెడ్డి, టీపీడీయూ అధ్యక్షుడు**

## చేతికందని కల్యాణలక్ష్మి | మహిళల నిరసన

ఎర్రగడ్డ: కల్యాణలక్ష్మి పథకం కోసం ఏడాది కిందట దరఖాస్తు చేసుకున్నా..కల్యాణలక్ష్మి చెక్కులు నేటికీ చేతికి అందకపోవడంతో మహిళలు నిరసనకు దిగారు. బోరబండ డివిజన్ వీకర్‌సెక్షన్‌లోని బ్రాహ్మణవాడి బస్తీలో బుధవారం జరిగిన ఈ నిరసనకు సీపీఎం మద్దతు పలికింది. ఈ సందర్భంగా సీపీఎం జూబ్లీహిల్స్ సీనియర్ నేత సాయిశేష గిరిరావు మాట్లాడుతూ ఏడాది కిందట కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న బ్రాహ్మణవాడి బస్తీ మహిళలకు ఆర్నెళ్ల కిందటే చెక్కులు మంజూరైనట్లు సంబంధిత శాఖ నుంచి సమాచారం అందిందని పేర్కొన్నారు. కానీ నేటి వరకు ఆ చెక్కులు లబ్ధిదారులకు అందకపోవడం విచిత్రంగా ఉన్నదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని విమర్శించారు. తులం బంగారం ఇస్తామన్న హామీ అటుంచి.. గత ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసుకున్న వారికి లక్ష రూపాయల చెక్కు ఇస్తే చాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు వెంటనే చెక్కులు అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసనలో మోహన్‌రాథోడ్, శివమ్మ, మీరా, గోపాల్, గమ్మిబాయి, సునీత, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

## ఊరెళ్తున్నారా జర జాగ్రత్త!

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ): పండుగల సమయంలో ఊళ్లకు వెళ్లే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు. రానున్న సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిఘాతో పాటు రాత్రి సమయాల్లో గస్తీని మరింత పెంచినట్లు సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. జన సంచారం తక్కువగా ఉండే కాలనీలు, బస్తీలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. అయితే ప్రజలు కూడా తమ వంతు జాగ్రత్తలు పాటించాలని సీపీ పలు సూచనలు జారీ చేశారు.

## 42,59,940 ఇండ్ల సర్వే

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతుందని, గ్రేటర్ వ్యాప్తంగా 10,70,463 అప్లికేషన్ల సర్వేలో 2570 లాగిన్‌లను క్రియేట్ చేసినట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 42,59,940 ఇండ్ల సర్వేను ఇప్పటి వరకు పూర్తి చేసినట్లు చెప్పారు.





సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, వివేకానంద్ తదితరులు

## కేంద్రం నిధులు సక్రమంగా వినియోగించాలి

### ప్రభుత్వ దవాఖానలు, పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి
### మేడ్చల్ జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

మేడ్చల్ కలెక్టరేట్/ కుత్బుల్లాపూర్ జనవరి 8: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని మల్కాజిగిరి ఎంపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై జిల్లాలోని అన్ని శాఖల ద్వారా పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని, కల్తీ లేని పాలు, సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ దవాఖానలు, పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించి, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జవహర్‌నగర్ చెత్త డంపింగ్ చుట్టూ 20 కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, అత్యవసర పనుల కోసం నిధులు కేటాయించాలని చెప్పారు. మన ఊరు-మన బడి కింద పాఠశాలలో పనులు నిలిచిపోయాని వాటితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. నిలిచిపోయిన పనులను పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు. పార్కులు ఇతర ప్రాంతాల్లో చెత్తను వేస్తున్నారని, స్వచ్ఛత, మరుగుదొడ్ల నిర్వహణ లేదని, కనీసం నీటి సరఫరా చేయడం లేదని సభ దృష్టికి తెచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అంగన్‌వాడీలకు వేతనాలు అందడం లేదని అన్నారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, వివేకానంద్ అన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద అంగన్‌వాడీ కేంద్రాలు, బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తులు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. విద్య, వైద్యం, తదితర సమస్యలపై ప్రతి మూడు నెలలకు సమావేశం నిర్వహించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలను పరిగణిస్తూ సమస్యలను పరిష్కరిస్తామని జిల్లాలను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్పీ సస్పెన్షన్

నమస్తే ఎఫెక్ట్

అల్లాపూర్, జనవరి 8 : ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వద్ద నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న రీసోర్స్ పర్సన్ అనితను సస్పెండ్ చేస్తూ మూసాపేట ఉప కమిషనర్ వంశీకృష్ణ ఉత్వరులు జారీ చేశారు. బుధవారం 'నమస్తే'లో 'రూ.500 ఇస్తేనే.. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన'.. అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి మూసాపేట ఉపకమిషనర్ వంశీకృష్ణ స్పందించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు దారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి ఇంటింటి సిబ్బంది వెళ్లి దరఖాస్తులను పరిశీలిస్తారని, ఒక వేళ ఎవరివద్దకైనా రాని పక్షంలో ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 100 శాతం ప్రతి దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి దరఖాస్తును పరిశీలించి, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తామని తెలిపారు.దరఖాస్తులు పరిశీలిస్తున్న సిబ్బంది పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. దరఖాస్తు పరిశీలనలో సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తే...సంబంధిత అధికారులకు లేదా...నేరుగా తనకే ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు ఉపకమిషనర్ వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## హెచ్‌ఎంపీవీ కేసులు లేవు

సిటీబ్యూరో: నగరంలో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదైనట్లు వస్తున్న వార్తలు పూర్తి అవాస్తవమని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ వెల్లడించారు. ఒక ప్రైవేటు ల్యాబ్‌లో జరిపిన పరీక్షల్లో 11 మందికి హెచ్‌ఎంపీవీ పాజిటివ్ వచ్చినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై డీహెచ్ స్పందిస్తూ రాష్ట్రంలో తమ రికార్డుల ప్రకారం ఇప్పటి వరకు ఎక్కడా కూడా హెచ్‌ఎంపీవీ కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. అనవసరంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, సొమ్ము చేసుకునే క్రమంలో కొన్ని ప్రైవేటు ల్యాబ్‌లు, దవాఖానలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు వీటిని నమ్మవద్దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ముందస్తు చర్యలు చేపట్టామని, గాంధీ, నిలోఫర్ తదితర దవాఖానల్లో ఇప్పటికే ప్రత్యేక వార్డులు సైతం ఏర్పాటు చేసినట్లు డీహెచ్ డా.డాక్టర్ రవీంద్రనాయక్ వెల్లడించారు. హెచ్‌ఎంపీవీ వైరస్ పెద్ద ప్రమాదకారి కాదని, అయినప్పటికీ ప్రజలు ముంద జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు.

## రాజకీయ కక్షతోనే కేసీఆర్ కుటుంబంపై ఆరోపణలు

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 8 : రాజకీయ కక్షతో మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపణలు చేస్తున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. మాజీ మంత్రి కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టి దర్యాప్తుల పేరుతో వేధిస్తున్నారన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి చాటి చెప్పింది కేటీఆర్ అని, నగర అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడ్డ నాయకుడిపై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచి.. ప్రజలను పక్కదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు ఒకరిపై మరొకరు పోలీసుల సమక్షంలోనే దాడు చేసుకోవడం ఇందులో భాగమేనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కేసులు పెట్టినా.. బీఆర్ఎస్ పార్టీ నేతలు భయపడరని చెప్పారు. కేటీఆర్ ఏసీబీ, ఈడీ విచారణకు హాజరవుతారని, నిజాయతీని నిరూపించుకొని.. మచ్చలేని నాయకుడిగా బయటికి వస్తారన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటామన్నారు.